క్లుప్తంగా

ఘనంగా భీష్మ ఏకాదశి ఉత్సవాలు



ప్రత్యేక పూజల్లో గంగపుత్రులు

మల్లాపూర్: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, వీవీరావుపేట, మొగిలిపేట, సాతారం, వాల్గొండ గ్రామాల్లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంగపుత్ర యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, సంఘం మండల గౌరవ సలహాదారుడు ఎల్ల చిన్నదేవయ్య, పట్టణ అధ్యక్షుడు ఎల్ల గంగాధర్, సభ్యులు ఆశాలు, నరేశ్, సురేశ్, నవీన్, గంగారాం, నికేష్, చిన్ననర్సయ్య, దేశవేని గంగారాం, పందిరి నర్సయ్య, పల్లికొండ రాజేందర్, కల్లెడ ప్రదీప్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు



బోనాలతో ముదిరాజ్‌లు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. డప్పుచప్పుల్ల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. ప్రజాప్రతినిధులు, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

జాతీయ పురస్కార గ్రహీత మల్లేశ్‌కు సన్మానం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న తుమ్మ గంగాధర్

మల్లాపూర్: యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ నుంచి సామాజిక సేవల విభాగంలో తెలంగాణ జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు గసవేని మల్లేశ్ జీవిత సాఫల్య జాతీయ పురస్కారాన్ని పొందడం అభినందనీయమని తెలంగాణ జాగృతి యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మ గంగాధర్ కొనియాడారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రేగుంటలో తెలంగాణ జాగృతి యువత ఆధ్వర్యంలో జీవిత సాఫల్య జాతీయ పురస్కార గ్రహీత మల్లేశ్‌ను ఆయన సన్మానించారు. నాయకులు బైరి రాకేశ్, గెల్లె రవి, కుందేళ్ల రాజేశ్, ముడంపల్లి మహేశ్, గెల్లె రాకేశ్, నేరేళ్ల శేఖర్, దండికే నవీన్, ద్యావతి శ్రీకాంత్, కొక్కెరకుంట రాకేశ్, తునికి గంగారెడ్డి, రాజారపు రాజేందర్, ముడంపల్లి రాము, హుస్సేన్, జలందర్, మదన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో బయోమెట్రిక్ ప్రారంభం



బయోమెట్రిక్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కాలిక్

మల్లాపూర్: ఇంటర్ విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.ఎ.కాలిక్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, సిబ్బందికి బయోమెట్రిక్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని అధ్యాపకులు, సిబ్బందికి అమలు చేస్తోందన్నారు. బయోమెట్రిక్ విధానం అమల్లోకి రావడంతో కళాశాల్లో అధ్యాపకులు, సిబ్బందికి జవాబుదారీతనం పెరిగి ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తారన్నారు. అధ్యాపక బృందం ప్రమీల, శ్రీనివాస్, రాజేందర్, రాజేశం, సుధాకర్, వేణుగోపాల్, రాజు, నరేశ్, సరిత, జూనియర్ అసిస్టెంట్ మల్లీశ్వరి, సిబ్బంది రాజం, స్వర్ణలత పాల్గొన్నారు.

కరెంట్ కోతల నివారణకు చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: వ్యవసాయానికి కరెంట్ కోతల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ అల్లూరి మహేందర్‌రెడ్డి బుధవారం కోరారు. విద్యుత్ కోతలతో చాలా చోట్ల పంటలు ఎండిపోతున్నాయని, ఇలాగే కొనసాగితే రైతులకు తీవ్రంగా నష్టం జరిగే అవకాశముందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయానికి అవసరం మేరకు కరెంట్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

జూనియర్ కళాశాలకు మోక్షమెన్నడు?

- దూరప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థులు
- కళాశాల ఏర్పాటుకు అనుకూలంగా జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణం
- త్వరగా నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి



కళాశాలకు అనుకూలంగా ఉన్న ఉన్నత పాఠశాల ప్రాంగణం

బుగ్గారం: ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఈ పునర్విభజనలో భాగంగా ధర్మపురి మండలంలో అంతర్భాగంగా ఉన్న బుగ్గారాన్ని 11 గ్రామాలతో కలిపి మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. మండలంలో అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కానీ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయలేదు. దీంతో మండలానికి చెందిన విద్యార్థులు జగిత్యాల, కరీంనగర్ వంటి పట్టణాల్లో చదువుతున్నారు. ఏటా మండలం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 200 మంది ఉత్తీర్ణులవుతున్నారు. మండలంలోనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని చాలాకాలంగా స్థానికులు కోరుతున్నారు. ఈప్రాంతంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు దూరభారం తప్పడమే కాకుండా ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానిక ప్రజలు అంటున్నారు.

అనుకూలంగా జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణం..

కళాశాల స్థాపనకు ప్రస్తుత జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం అనుకూలంగా ఉంది. విశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉంది. ఈ ప్రాంగణంలో కళాశాల నిర్వహణకు అవసరమయ్యే కొన్ని అదనపు గదులు నిర్మించి మరికొన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తే కళాశాల ఏర్పాటు చేయవచ్చు. అలాగే మండలంలోని 11 గ్రామాలతో పాటు ఇతర మండలాల సమీప గ్రామాల విద్యార్థులకు సైతం ఎంతో అనువుగా ఉంటుంది.

కళాశాల ఏర్పాటు చేయాలి



మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని చాలాకాలం నుంచే అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశాం. ప్రస్తుతం కొనసాగుతున్న ఉన్నత పాఠశాలలో కళాశాలను ప్రారంభించేందుకు అవసరమైన సదుపాయాలున్నాయి. విశాలమైన ఆట స్థలం ఉంది. కావున ప్రజాప్రతినిధులు స్పందించి కళాశాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి.

– అక్రం మాలిక్, ఏఐఎస్ఎఫ్ఐ సెక్రటరీ, జగిత్యాల

మంత్రి దృష్టికి తీసుకెళ్లినం



ఇప్పటికే మండలంలోని కోట్లాది రూపాయల నిధులతో మంత్రి ఈశ్వర్ సహకారంతో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నం. అలాగే కళాశాల ఏర్పాటుకు సంబంధించి మండలవాసుల కోరికను మంత్రి దృష్టికి తీసుకెళ్లినం. ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మండలవాసుల కల సాకారం అవుతుందని ఆశిస్తున్నం.

– బాదినేని రాజేందర్, జెడ్పీటీసీ, బుగ్గారం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



కుమ్మరిపల్లి స్కూల్ వద్ద ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

రాయికల్: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం కేసీఆర్ మన ఊరు–మన బడి కింద మౌలిక వసతులు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కుమ్మరిపల్లిలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొదటి విడతలో జగిత్యాల నియోజకవర్గంలో 75 పాఠశాలలను ఎంపిక చేశామని, కార్పొరేట్ తరహాలో అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కుమ్మరిపల్లి పాఠశాలలో గ్రామానికి చెందిన నాగమల్ల శ్రీనివాస్–ఉమ దంపతులు రూ.60వేల వ్యయంతో నిర్మించిన సరస్వతిదేవి విగ్రహం ఆవిష్కరించారు. అనంతరం రాయికల్ పట్టణంలోని 11వ వార్డులో రూ.2లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. వర్తక సంఘ భవనంలో 40 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కింద మంజూరైన చెక్కులు, 52 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ మకరంద్, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఎంపీటీసీ దొంతి నాగరాజు, ఉపసర్పంచ్ బొంగు రాజు, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు మ్యాకల అనురాధ, సాయికుమార్, శ్రీధర్‌రెడ్డి, మ్యాకల కాంతారావు, ఎలిగేటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

జగిత్యాలరూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐకేపీ వీవోఏల సంఘం ఆత్మీయ సమ్మేళనానికి బయల్దేరుతున్న బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పడంతో పాటు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేయడంలో అగ్రగామిగా ఉండాలన్నారు. ఎంపీపీ రాజేంద్రప్రసాద్, కూతురు శేఖర్ పాల్గొన్నారు.

బీర్‌పూర్ ఘాట్‌రోడ్డుకు మరమ్మతు



రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న పోలీసులు

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురవడంతో బీర్‌పూర్ ఘాట్‌రోడ్డు ఆర్‌వీ మెయిన్ కాలువ నుంచి దాదాపు 500 మీటర్ల వరకు రోడ్డుకు ఇరువైపులా భారీ కోతకు గురికావడం, గండ్లు పడడంతో బుధవారం బీర్‌పూర్ ఎస్సై అజయ్ ట్రాక్టర్లు, జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్లను ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోయించి వాహనదారులు ఇబ్బంది పడకుండా చదును చేస్తున్నారు. బీర్‌పూర్ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ జాతరస్థలిలో పంచాయతీ సిబ్బందితో చెత్త, పిచ్చిమొక్కలు తొలగించడం, బ్లేడ్ ట్రాక్టర్ల సాయంతో చదును చేసే పనులు చేపట్టారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



ఊరేగింపు సేవకు బయల్దేరుతున్న స్వామివారు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి 8గంటలకు ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో మొదటిరోజు స్వామివారి ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు, అమ్మవారు ఉత్సవమూర్తులను సేవా పల్లకిలో ఆసీనులను చేసి ఊరేగింపు సేవ నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, కాసం మల్లేశం, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు పాల్గొన్నారు. కాగా గురువారం రాత్రి 9 గంటలకు స్వామివారు, అమ్మవారి కల్యాణం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై నిర్వహిస్తారు.

కొడిమ్యాలలోని నల్లగొండలో..

కొడిమ్యాల: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నల్లగొండలో శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదురోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, బేరి పూజ, దేవత ఆహ్వానం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మారుతి, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦రాజన్న ఆలయం హుండీ లెక్కింపు

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర్ ఆలయం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. హుండీ లెక్కింపు ద్వారా రెండు, మూడు నెలలకు సంబంధించి రూ.57వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శి పోచయ్య, సభ్యులు పాల్గొన్నారు.

✦నేడు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

మల్యాల: మండలంలోని మానాల గ్రామంలోని శ్రీనల్లగుట్ట లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. 5న స్వామివారి ఆలయ పరిసరాల్లో రథోత్సవం, జాతర ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

✦అయితిపల్లిలో కంటివెలుగు ప్రారంభం

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లి గ్రామంలో అధికారులు రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఐదురోజుల పాటు శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ గంగాధర్, సర్పంచ్ కొండయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ రహీం, ఉప సర్పంచ్ లచ్చయ్య, వార్డు సభ్యులు రమ, రజియా, శోభ, ఆర్బీఎస్ కన్వీనర్ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

✦క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

పెగడపల్లి: యువత క్రీడలతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ రాజేందర్‌రావు సూచించారు. ఈ మేరకు మండలంలోని రాజరాంపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారులకు జెడ్పీటీసీ బుధవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ రవి, ఉపసర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, యువజన సంఘాల నాయకులు రవి, ఇస్లావత్ రమేశ్‌నాయక్, ఇస్లావత్ శేఖర్‌నాయక్, నగావత్ రుబ్లానాయక్, కిరణ్‌కుమార్, తిరుపతినాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

✦రాయికల్‌లో 5 నుంచి భీమన్న ఉత్సవాలు

రాయికల్: పట్టణంలో 5వ తేదీ నుంచి భీమన్న జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దేవుని నర్సయ్య బుధవారం తెలిపారు. 5న స్వామివారి కల్యాణం, 6న అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, 7న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జగిత్యాల ఎంపీడీవోగా గంగాధర్

జగిత్యాలరూరల్: జగిత్యాల ఎంపీడీవో స్వరూపరాణి వలంటరీ రిటైర్మెంట్ తీసుకోగా జగిత్యాల ఎంపీడీవోగా గంగాధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల రూరల్ మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గంగాధర్‌కు జగిత్యాల ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

16న విగ్రహ ప్రతిష్ఠ

బుగ్గారం: మండల కేంద్రంలోని సంతాన సాఫల్య శ్రీసాంబశివనాగేశ్వర నాగాలయంలో 16న ప్రతిష్ఠించనున్న సంజీవాంజనేయస్వామి విగ్రహానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుగ్గారం సర్పంచ్ మూల సుమలత, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను వినియోగించుకోవాలి

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం తపాలశాఖ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్ట్‌మాస్టర్ రాజేశ్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని ముత్యంపేటలో తపాలశాఖ ఆధ్వర్యంలో పోస్టల్‌బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసుల్లో లభ్యమయ్యే సేవలు, కేంద్ర ప్రభుత్వం తపాలశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను పోస్టల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం జీవితబీమా పథకాన్ని ప్రవేశపెట్టి 140ఏళ్లు పూర్తయినందున కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డితో రూ.10లక్షల విలువ గల జీవితబీమా చేయించారు. అధికారులు భూమేశ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి



చిన్నారులకు అన్నప్రాసన

జగిత్యాలరూరల్: తల్లులు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని జగిత్యాల రూరల్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. ఈ మేరకు బుధవారం టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్ఎంసీ కమిటీ సమావేశంతో పాటు ఆరునెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి పోషకాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు వనిత, ఆశా కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



మినీ స్టేడియం ఏర్పాటుకు మోక్షమెన్నడు?

సారంగాపూర్: మినీ స్టేడియం ఏర్పాటు చేయడానికి మండలంలోని పోతారం శివారు గ్రామం గణేశ్‌పల్లిలో 2016–17లో స్థల సేకరణ జరిపి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి సేకరించిన ఐదు ఎకరాల స్థలంలో పనులు ప్రారంభం కావడం లేదు. మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం 2022లో రూ.2.65కోట్లు మంజూరు చేసింది. పనులకు టెండర్లు నిర్వహించడానికి ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌కు అప్రూవల్ కోసం పంపించారు. దీనిపై ఇప్పటికీ ప్రగతి కనిపించడం లేదు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : భూపతి, పంచాయతీరాజ్ ఇంజనీర్, సారంగాపూర్
ఫోన్ నంబర్ 91211 35727

పంట మార్పిడిపై రైతులు దృష్టిసారించాలి



ఆయిల్‌పామ్ మొక్క నాటిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

మేడిపెల్లి: పంట మార్పిడిపై రైతులు దృష్టిసారించాలని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సూచించారు. ఈ మేరకు బుధవారం బీమారం మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామంలో రైతు శ్రీపాల్‌రెడ్డి తోటలో ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై అందిస్తున్న ఆయిల్‌పామ్ మొక్క నాటారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని, రైతులు ఒకే రకమైన పంట వేయకుండా పంటమార్పిడి పద్ధతిపై దృష్టిసారించాలని కోరారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంటకు భారీగా సబ్సిడీ ఇస్తుందని పేర్కొన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, సర్పంచ్ జగన్ రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, ఎంపీటీసీల లక్ష్మి, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు అన్వేష్, సౌమ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.పి.సింగ్

మల్లాపూర్: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీని ప్రజలే కాపాడుకోవాలని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అని మెట్‌పల్లి ఆర్టీసీ డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జీపి.సింగ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంతో పాటు సిరిపూర్ గ్రామాల్లో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజల వద్దకే ఆర్టీసీ సేవలు' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ ఎన్నో రకాల పథకాలు, రాయితీలతో సేవలు అందిస్తోందన్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం సురక్షితం కాదని, ఆర్టీసీ బస్సుల్లో శిక్షణ పొందిన డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డిపో ఆర్టీసీ అధికారులు సురేశ్, ఉపేందర్, రాఘవ, పొలాస రాజశేఖర్, సర్పంచ్ భూక్య గోవింద్ నాయక్, ఎంపీటీసీలు ఆకుతోట రాజేశ్, ఏనుగు రాంరెడ్డి, నాయకులు సిరిపురం రవీందర్, మోర సతీశ్, సోమ గోపి, బొక్కల నాగరాజు, నర్సయ్య, కస్తూరి రాజు, అబ్బూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాకసముద్రం వద్ద కొట్టుకుపోయిన తూము

- కొల్వాయికి నిలిచిన సాగునీరు



వృథాగా పోతున్న సాగునీరు

సారంగాపూర్: రోల్లవాగు ప్రాజెక్టు నుంచి ఆర్‌వీ మెయిన్ ద్వారా 2ఎల్ కాలువకు వెళ్లే సాగునీటిని తుంగూర్ గ్రామ శివారుల్లోని శాకసముద్రం చెరువులోకి తరలించడానికి ఏర్పాటు చేసిన తూము కొట్టుకుపోవడంతో బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి సాగునీరు నిలిచిపోయింది. రోల్లవాగు నుంచి కొల్వాయి 2ఎల్ కాలువకు గతంలో ఎలాంటి తూము నిర్మాణం లేకపోవడంతో 2ఎల్ ద్వారా నేరుగా నీరు కొల్వాయి రైతుల భూములకు చేరేది. ఇటీవల శాకసముద్రం చెరువులోకి రోల్లవాగు నీటిని తరలించడానికి అధికారులు 2ఎల్ కాలువకు తూమును ఏర్పాటు చేశారు. తూము నిర్మాణంలో నాణ్యతా లోపంతో తూము కొట్టుకుపోయి మొత్తం నీరు శాకసముద్రం చెరువులోకి, మరికొంత నీరు వాగులోకి వృథాగా వెళుతుంది. తూము కొట్టుకుపోవడంతో కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు కొల్వాయి గ్రామ రైతుల పొలాలకు సాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. తూము కొట్టుకుపోయిన చోట గురువారం మరమ్మతు పూర్తి చేసి కొల్వాయి గ్రామానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినట్లు ఎమ్మెల్సీ రైతులకు వివరించారు.

యాసంగిలో మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న నాగమణి

మల్లాపూర్: యాసంగిలో పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సొంతమవుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి సంధ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ముత్యంపేటలో రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, రాయితీ విత్తనాలు, యాంత్రీకరణ, పంటల రూణాల గురించి రైతులకు వివరించారు. సేంద్రియ వ్యవసాయంలో యోగిక్‌కేతితో కలిపి పంటలు పండిస్తే అతి తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన పంటలు పండి రైతులు బలోపేతం అవుతారని వివరించారు. ఉపసర్పంచ్ అల్లూరి మహేశ్‌రెడ్డి, రైతులు గంగారెడ్డి, రమేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కోరుట్లరూరల్: వరి పంటలో కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని సర్పరాజ్‌పూర్ గ్రామంలో వరి పొలాలను ఏవో సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దానవేణి సాయమ్మ, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు నత్తి రాజ్‌కుమార్, ఏఈవో మమత పాల్గొన్నారు.